# బాలు భీషణ భాషణం



అక్కను చూసి రెండేళ్ళు దాటింది.

అందువల్ల ఈసారి హైదరాబాద్ రాగానే ముందుగా అక్క ఇంటికే వెళ్లాను. మామూలుగా అయితే అక్క ఇంట్లోనే దిగేవాడిని. కాని... నేను వచ్చింది ఆఫీసు పని మీద. అదికూడా నలుగురం కలిసి వచ్చాం. మా అందరికీ స్టార్ హోటల్‌లో దిగే అర్హత ఉంది.

మేము ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే కంపెనీ కారు మాకోసం రెడీగా ఉంది. దాంట్లో మేం నలుగురం హోటల్ భాస్కర్ ప్యాలస్‌కి వెళ్లాం.

మా ఆఫీస్ మీటింగ్ సాయంత్రం నాలుగు గంటలకు మొదలవుతుంది. అప్పటివరకూ మేము ఎక్కడికి వెళ్లి వచ్చినా పర్వాలేదు. అందుచేత హోటల్‌లో దిగి స్నానాలూ, టిఫిన్‌లూ పూర్తి అయ్యాక అందరం తలోవైపుకి బయలుదేరాం. నేను అక్కని చూడడానికి బయలుదేరాను. తిరిగి అందరం హోటల్‌కి మూడు గంటలకల్లా వచ్చేయాలనుకున్నాం.

నన్ను చూడగానే అక్క ముఖం చేటంత అయింది.

"ఏమిట్రా... చెప్పాపెట్టకుండా ఊడిపడ్డావు. సామానేదీ?" అంది.

"ఆఫీసు పని మీద వచ్చాన్లేవే... హోటల్‌లో దిగాను" అన్నాను.

"అఘోరించినట్లుంది. వేం ఇక్కడ ఉంటే హోటల్‌లో దిగడమేమిటీ? వెధవ్వేషాలూ... నువ్వూను!" అంది శాంతక్క– నన్ను చిన్నతనంలో తిట్టినట్లు.

"నేను ఒక్కడినే రాలేదే! ఆఫీసు పని మీద నలుగురం వచ్చాం. మేమందరం ఒకేచోట ఉండడం అవసరం. అందుకే హోటల్‌లో దిగాం. అది కూడా కంపెనీ ఖర్చు మీద!"

"సరే... ఏ హోటల్‌లో దిగావు?"

"హోటల్ భాస్కర్ ప్యాలస్‌లో! అది సరేగాని.., బావగారు కనిపించరే..? ఈరోజు ఆదివారం కూడాను!"

"హూ.... నీకు తెలీనిదేముంది నాయనా? ఆయనకి నెలలో ఇరవై రోజులు క్యాంప్‌లేనాయె. నిన్ననే వెళ్లారు. శనివారానికి కానీ రారు."

"బాగుంది. మరి స్వాతి ఏదీ..? బయటకి వెళ్లిందా?"

"పడుకుని ఉంది."

"పడుకోవడమా? పది కావస్తున్నా ఇంకా పడుకోవడమేమిటి? ఒంట్లో బాగాలేదా?"

"ఒంట్లో బాగానే ఉంది. మనసే బాగాలేదు. రాత్రంతా నిద్రపోలేదు. ఏడుస్తూ కూర్చుంది. ఏ తెల్లవారో నిద్ర పట్టినట్లుంది. అందుకే నేనూ లేపలేదు."

"ఏడ్చిందా? ఎందుకు? ఏం జరిగింది?"

అక్క బరువుగా నిట్టూర్చింది.

"ఏం చెప్పమంటావు నాయనా... అదో పెద్ద కథ! స్వాతి మంచి డాన్సర్‌గా పేరు తెచ్చుకున్న విషయం నీకు తెలిసినదే. ఈమధ్య దానికి రసజ్ఞ సంస్థవారు 'నాట్య మయూరి' అని బిరుదు ఇచ్చి సత్కరించారు. దాని తర్వాత మరో సంస్థ రస రంజని 'నాట్య సుందరి' బిరుదు ఇచ్చి సన్మానించింది. ఇంతటి ప్రతిష్ఠాపూర్వకమైన పురస్కారాలు లభించడంతో రస ప్రోత్సాహక సంస్థవారు దానికి అభినందన సభను ఏర్పాటు చేశారు. అందులో రాష్ట్ర

గవర్నర్ చేతుల మీదుగా 'నాట్య కిన్నెర' అన్న బిరుదును ప్రదానం చేయడమే కాక.., దాని నాట్య ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు."

"అరే... నా కళ్ల ముందు పరికిణీలు కట్టుకుని ఒప్పులకుప్పలు ఆడిన పిల్ల ఎంతగా ఎదిగిపోయిందీ..? నాకు ఈ విషయాలేవీ తెలియవే..!"

"ఎలా తెలుస్తాయ్..? ఉత్తరాలు రాసే అలవాటు మాకు లేదు. ఇక్కడి వార్తలు అక్కడి పేపర్లలో రావు."

"బాగానే ఉంది. ఇంతకీ స్వాతి ఎందుకు ఏడ్చిందో అర్థంకాలేదు."

"అదే చెప్తున్నాను. ప్రోగ్రాం అయిపోయిన తర్వాత చాలామంది స్వాతి దగ్గరకు వెళ్లి అభినందించసాగారు. అంతలో ఎక్కడి నుంచి ఊడిపడ్డాడో ఆ దరిద్ర ముండాకొడుకు... బాలు కూడా అక్కడ తగలడ్డాడు."

"బాలు ఎవరు?"

"మరిచిపోయావా? ఈ ఇంట్లో ప్రక్క భాగంలో ఉండేవాడు... ఐదేళ్ల క్రితం మద్రాసుకి బదిలీ అయి వెళ్లిపోయాడు- జ్ఞాపకం లేదూ..?"

"ఎవరూ... బాలసుబ్రమణియనా? జ్ఞాపకం వచ్చింది. ఆయన వస్తే ఏమైంది..?"

"ఏముందీ... తానూ స్టేజి ఎక్కి స్వాతి దగ్గరకు వెళ్లి- 'అమ్మాయి... నేను జ్ఞాపకం ఉన్నానా?' అని అడిగాడట."

"అయ్యో... జ్ఞాపకం లేకపోవడమేమిటండీ! అందట స్వాతి."

"నీ గురించి విన్నాను. నీ పిరుదులు నీకు తగ్గట్లుగా చాలా బాగున్నాయి!' అన్నాడట. అందరూ ఫక్కున నవ్వారట. స్వాతి ఇంక అక్కడ ఉండలేక ఇంటికి వచ్చి ఒకటే ఏడుపు!"

"పిరుదులు బాగుండడమేమిటి... వాడి పిండాకూడు!"

"అదే నాకూ అర్థంకాలేదు. ముదనష్టపోడు ఏం కూశాడో.., ఏమో!"

"ఎప్పుడూ నోట్లో కారా కిళ్ళీ పెట్టుకుని తగలడ్తాడు కదా..! వాడు ఏదో అంటే ఏదోలా వినిపించి ఉంటుంది."

"కావచ్చు. కాని... నలుగురిలో నవ్వుల పాలైందిగా! పిచ్చి పిల్ల... ఇంక తనని అందరూ నీ పిరుదులు బాగున్నాయని అంటూ ఏడిపిస్తారని బాధపడ్తోంది వెర్రిది!"

"కాదు మరీ! వెధవ... నేనుంటే గనుక వాడి కాళ్లు విరగ్గొట్టుండేవాడిని!"

"అంత పని వద్దులే కాని.., ఎక్కడైనా కనిపిస్తే కడిగి వదిలిపెట్టు. మరోసారి ఇలాంటి కారుకూతలు కూయకుండా నోట్లో ఇంత గడ్డి పెట్టు."

"అదుగో... మన మాటలు విని లేచినట్లుంది స్వాతి... ఇటే వస్తోంది!"

స్వాతి నెమ్మదిగా వస్తోంది. ఏడ్చినందువల్లనో, ఏమో... కళ్లు ఉబ్బి ఉన్నాయి.

స్వాతి దగ్గరకు రాగానే- "హలో స్వాతీ... కంగ్రాట్యులేషన్స్!" అన్నాను.

"కంగ్రాట్సు చెప్పాల్సినంత గొప్పేమీ లేదులే మామయ్యా..!"

"అలా అనకు. యువర్స్ ఈజ్ రియల్లీ ఎన్వియబుల్ సక్సెస్. అమ్మ చెప్తే అంతా విన్నాలే! టేకిట్ ఈజీ! ఆ బాలుగాడు ఒట్టి క్రాక్. వాడు ఏం మాట్లాడ్తాడో వాడికే తెలియదు. వాడి ముఖంలానే ఉంటాయి వాడి మాటలు!"

"సర్లే మామయ్యా... నేను ఫ్రెష్ అయి వస్తాను."

"ఇంక ఆ విషయం మర్చిపో. బాడీతోపాటు మైండ్‌ని కూడా ఫ్రెష్ చేసుకుని రా. వాడు కనిపిస్తే నాలుక మీద కాల్చి వాత పెడ్తాను."

"టేకిట్ ఈజీ మామయ్యా..!" అంది స్వాతి నవ్వు తెచ్చుకుంటూ.

* * *

ఆబిడ్స్‌లో నాకు కొంచెం షాపింగ్ ఉంది.

అది చూసుకుంటుంటే అనుకోకుండా బాల సుబ్రమణియన్- అదే... 'బాలు' కనిపించాడు. నేను బొంబాయి వెళ్లిపోకముందు మా అక్క ఇంట్లోనే ఉండేవాడిని. అందువల్ల మా ప్రక్క వాటాలో ఉండిన బాల సుబ్రమణియన్ ముఖారవిందం రోజూ దర్శనం అవుతుండేది.

అదే అడ్డ పంచె.., అదే పొడుగు చేతుల చొక్కా.., ముఖానికి అవే పిండి కట్లు.., వాటి మధ్య పెద్ద కుంకుమ బొట్టు. మనిషి వేషంలో కాని, భాషలో కాని, రూపు రేఖా విలాసాలలో కాని, విన్యాసాలలో కాని, భంగిమలలో కాని ఏ విధమైన మార్పూ లేదు. ఈ హంగులకి తోడు- శివుడు గరళాన్ని గొంతులో దాచుకున్నట్లు బుగ్గని ఎన్నడూ వీడని కారా కిళ్ళీ!

నన్ను చూడగానే గుర్తుపట్టాడు.

"యారూ... మోగనా?" అన్నాడు.

'నువ్వు మోగుతానంటే నేనెందుకు వద్దంటాను? అలాగే మోగు!' అని మనసులోనే అనుకున్నాను.

అరవంలో 'హ'ని 'గ'గా పలుకుతారు. అందుకే మోహన్ కాస్తా వాళ్ళ నోళ్లలో పడి 'మోగన్' అయిపోయింది.

నేను ఏదో అనేలోపే- "ఏమండీ... సౌక్యమా? మిమ్మల్ని చూసి రొంబ కాలం అయింది" అంటూ ఆప్యాయంగా పలుకరించాడు.

వస్తున్న కోపాన్ని లోలోపలే అణచుకున్నాను. పైకి మాత్రం మర్యాదగా- "ఆ.... బాగానే ఉన్నాను. మీరు బాగున్నారా? ఇప్పుడు ఎక్కడున్నారు?" అన్నాను.

"నాన్‌దా మద్రాసులోనే ఉంటిని. ఇంద ఊరి హైకోర్టుల ఒరు కేసు వుంటేనూ అదుకోసందా వస్తిని!" అన్నాడు.

తెలుగు, అరవం కలిపి హైబ్రీడ్ భాష మాట్లాడటం ఆయనకి మొదటినుంచీ అలవాటే! అచ్చ తెలుగులో హైబ్రీడ్ భాషకి బదులు 'సంకర భాష' అనవచ్చునేమో కాని, ఆ మాట మరీ వంకరగా ఉంటుందని అనలేదు. నిజానికి- సంకర భాష అనేది మాత్రం అచ్చ తెలుగా ఏమిటి? సంకర, భాష... అనేవి రెండూ అచ్చమైన సంస్కృత పదాలు. మరి... అచ్చ తెలుగులో ఏమనవచ్చునబ్బా... అని మధనపడ్తుండగా-

"సామీ... నీంగళ్ ఇప్పుడు కూడా నల్లగుండలోనే ఉంటిరా?" అన్న ఆయన ప్రశ్నతో నా ఆలోచనలకు అడ్డుకట్ట పడింది.

'నల్లగుండ ఏమిటయ్యా... నీ ఇల్లు చల్లగుండా!' అని మనసులోనే అనుకొని, "లేదు... నేను బొంబాయిలో ఉంటున్నాను. మా అక్కావాళ్ళు నల్లకుంటలోనే ఉన్నారు" అన్నాను.

నల్లకుంటకి వచ్చిన తిప్పలు అది! బాల సుబ్రమణియన్ నోట్లో పడి నల్లకుంట కాస్తా 'నల్లగుండ' అయింది. గతంలో ఆయనా, మేమూ ఒకే ఇంట్లో పక్క పక్క భాగాలలో కాపరం చేస్తుండేవాళ్ళమని చెప్పాను కదా! మొదట్లో ఆయన మాటలు వింటుంటే చచ్చే నవ్వు వచ్చేది. తర్వాత తర్వాత అలవాటు అయిపోయి పైకి నవ్వుకోకపోయినా విని ఆనందిస్తూ మనసులోనే హాయిగా నవ్వుకుంటుండే వాళ్ళం.

"మన ఇంటాయన గోడలు వచ్చిందా?" మరో ప్రశ్న వేసి నా ఆలోచనలను అడ్డుకున్నాడు బాలు.

"ఆయనండీ... కోడేశ్వరరావుగారు- ఆయన గోడలి సంగది నేనంటూంట!" అంటూ కొంచెం వివరణ ఇచ్చాడు బాలు.

కోడేశ్వరరావు అనగానే కన్యాశుల్కంలోని 'నీ ఇంట కోడి కాల్చా!' అని అగ్నిహోత్రావధానులు తిట్టిన తిట్టు జ్ఞాపకం వచ్చి, నేను కూడా బాలుని అలానే దీవిద్దామనిపించింది. కాని.., ఎంతైనా పెద్ద ముండావిడ- బాగుండదులే..! అని ఊరుకున్నాను.

కోటేశ్వరరావుగారు ( ఆయన్ని కోడిని చేశాడు బాలు ) గతంలో నల్లకుంటలో మేం ఉండే ఇంటి యజమాని. ఆయన్నే బాలు ఇందాక 'మన ఇంటాయన' అని ముద్దుగా అనింది. కోటేశ్వరరావుగారు కాస్తా బాలు నోట్లో పడి ఒక్క కోడీ లేకపోయినా 'కోడేశ్వరుడు' అయిపోయాడు.

కోడితోపాటు నాకు 'గోడలు' రహస్యం కూడా అవగతమయింది. మేము ఆ ఇంటిలో ఉన్నప్పుడు ఇంటికి పెద్ద అవరణ ఉన్నా కాంపౌండ్ వాల్ ఉండేది కాదు. బాలుగారికీ, మాకు మాకు కూడా మొక్కలు, కాయగూరల పాదులూ వంటివి పెంచడమంటే సరదా! మేము కష్టపడి పెంచుతుంటే మేకలు, గొడ్లూ వచ్చి తినేసిపోతూ ఉండేవి. ప్రొద్దుటిపూట షేమూ, మేము ఆఫీసులకి వెళ్లాక ఆడవాళ్ళూ కాపలా కాసినా ఏ రాత్రిపూటో వచ్చి మేసేసి పోతుండేవి. ఈ బాధ పడలేక అద్దె డబ్బులు చేతిలో పెట్టేటప్పుడో, ఆనందంగావున్న సమయం చూసో- 'అయ్యా కోటేశ్వరరావుగారూ... కాస్తంత గోడలు కట్టిద్దురూ..!' అని వినయంగా విజ్ఞప్తి చేస్తుండేవాళ్ళం. ఆయన 'అలాగే... దానిదేముంది? అలాగే కట్టిస్తాను' అంటూ కాలం గడిపాడే కాని.., ఆ సత్కార్యం మాత్రం అప్పటికీ, ఇప్పటికీ చేయనేలేదు. ఈరోజు నేను అక్కడ ఇంటికి వెళ్లినప్పుడు కూడా చూశాను. ఇంటి స్థలం ప్రహరీ గోడలు లేకుండా వెనుకటి లాగానే ఉంది. మేము అక్కడ ఉండగానే అడిగి అడిగి విసుగొచ్చి అడగడం మానేశాం. మొక్కలు పెంచడమూ మానేశాం.

'అయ్యో... ఈ బ్రాహ్మడు మద్రాసు వెళ్లి ఐదేళ్లు దాటినా ఇంకా గోడల సంగతి అడుగుతున్నాడే! పాపం... ఈయనకి మొక్కలంటే ఎంత శ్రద్ధా..?!' అనుకుంటూ-

"లేదండీ. కోటేశ్వరరావుగారి సంగతి మీకు తెలిసిందేగా! ఆయన ఇప్పటికీ గోడలు పెట్టించనే లేదు. ఆ కాంపౌండ్ అలాగే ఉంది!" అన్నాను.

"మురుగా... మురుగా!" అన్నాడు బాలు.

'ఉన్నట్లుండి మురుగు ఎక్కడ వచ్చిందా...' అనుకుంటూ, ముక్కు చిట్లించుకుంటూ నలువైపులా చూశాను. మురుగు కనిపించే లోపలే బాలుగారి మాటలు వినబడ్డాయి.

"ఆయన వీట్టు సంగతి కాదు సామీ- నాన్ సొన్నది! అవరి చిన్న గోడలు సంగది. అదే... ఆయన చిన్న పయ్యన్ రామనాథం లేడూ... అవణ్ మగళ్ సంగది!" అన్నాడు మళ్లీ.

అప్పుడు నాకు జ్ఞానోదయమయింది. ఆయన అన్నట్టి 'మురుగా... మురుగా!' మనం మామూలుగా అనుకొనే 'రామ రామ!' కి పర్యాయ పదమని. ఆయన కుమారస్వామి భక్తుడు కనుక మురుగన్‌ని తలచుకున్నాడు. అరవ వాళ్ళు కుమారస్వామిని మురుగన్

అనీ, కందస్వామి అనీ (స్కందే- కంద అయ్యింది), వేలుస్వామి అనీ (కుమారస్వామికి ఉండే బల్లెం వంటి ఆయుధాన్ని వేల్) అంటారు. వీటిలో 'మురుగన్' అనే నామం అత్యంత ప్రసిద్ధి పొందినట్టిది.

ఆ తర్వాత నాకు అర్థం అయ్యింది. ఆయన అడిగింది... కోటేశ్వరరావుగారి చిన్న కోడలు గురించి అని! రామనాథం కోటేశ్వరరావుగారి చిన్నబ్బాయి. అతనికి పెళ్ళయిన కొత్తలో భార్యాభర్తల మధ్య ఏవో తగాదాలు వచ్చాయి. దాంతో ఆ అమ్మాయి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. వాళ్ళూ, వీళ్ళూ కల్పించుకుని నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. చివరికి విభూతి పిండికట్లు, కుంకుమ బొట్టుతో దైవభక్తుడివలె కనిపించే బాలసుబ్రమణియన్‌గారిని పంపితే ఆ రాయబారం శ్రీ కృష్ణ రాయబారంలా కాకుండా, సంజయ రాయబారంలాగా సానుకూల పడవచ్చునని ఆయనని పంపారు. పైగా... ఆ అమ్మాయివాళ్ళది కూడా మద్రాసే కావడంతో అది తప్పక విజయవంతమవుతుందని ఆశించారు. అయినా లాభం లేకపోయింది. ఆ విషయాలన్నీ నా మనసులో మెదిలాయి.

"లేదండీ... వాళ్ళు తర్వాత విడాకులు తీసుకున్నారు. ఆ అబ్బాయి మళ్లీ పెళ్ళి చేస్కున్నాడు కూడా! అమ్మాయి సంగతి తెలీదు" అన్నాను.

"కడవులే... కడవులే... ఎన్నా ఇది? రొంబ కలిగాలం!" అన్నాడు బాలు చేతులు పైకి ఎత్తి ఆకాశంలోకి చూస్తూ.

'కడవులూ లేదు.., అడవులూ లేదు... ఊర్కోవయ్యా స్వామీ!' అని మనసులోనే అనుకున్నాను. ఆయన స్వాతిని అవమానపరచిన విషయం నా మనసుని పురుగు తొలిచినట్లు తొలుస్తోంది. ఆ విషయం ఏ విధంగా కదిపి నాలుగు చివాట్లు పెట్టాలా... అని ఆలోచిస్తూంటే ఆ ప్రస్థావన ఆయనే తెచ్చాడు-

"చూడు సామీ... మీ అక్కా, బావా సౌక్యమా?" అంటూ.

"ఆ.... సౌఖ్యమే! అన్నట్లూ... మా స్వాతిని నిన్న మీరు చూశారటగా? కలిసి మాట్లాడారట కూడా!" అన్నాను కోపాన్ని ముఖంలో కనబడనీయకుండా.

"ఆమ... అవునప్పా! ఆమె నాట్టియం చూస్తిని. రొంబ నల్ల నాట్టియం అప్పా. నాకదా రొంబ సందోషబడిదిని!" అన్నాడు తన్మయత్వంతో.

"ఆ సబలో సొన్నారు. ఆ అమ్మాయికి రెండు గొప్ప పిరుదులు కూడా ఇచ్చినారటగా! నాట్టియ సుందరి, నాట్టియ మయూరి. ఇవి రెండూ మంచి పిరుదులు. శానా బాగున్నాయి. రొంబ ఆనందమాచ్చి!" అన్నాడు మళ్లీ.

అంతే..!

బాలుగారి 'పిరుదుల రహస్యం' అర్థమైపోయింది. ఆయన నోట్లో పడి 'బిరుదులు' కాస్తా 'పిరుదులు' అయిపోయాయి. ఆయనగారి మీద నెయ్యిలా పేరుకున్న కోపం వెన్నలాగా కరిగిపోయింది. ఆ క్షణంలో ఆయన ముఖంలో తాండవిస్తున్న నిష్కాపట్యం, అమాయకత్వం చూస్తుంటే ఆయన పట్ల గౌరవం పెరిగింది.

ఒక భాషలో మంచి అర్థం ఉన్న మాటకి మరో భాషలో పరమ ఛండాలమైన అర్థం ఉండవచ్చు. అలాగే... ఉచ్చారణలో మంచి మాటల రూపం చెడుగా మారవచ్చు. ఇందుకు 'బిరుదులు... పిరుదులు' కావడమే మంచి ఉదాహరణ! ఆయనలో దురుద్దేశం లేనప్పుడు జరిగినదానికి బాధపడవలసిన అవసరం లేదు. హాయిగా నవ్వుకుంటే సరిపోతుంది.


తేలిక పడ్డ మనసుతో- "ఇవాళ మా ఇంటికి రండి. మా అక్కా, బావా మిమ్మల్ని చూసి చాలా కాలమైంది. మీరు వస్తే చాలా సంతోషిస్తారు" అన్నాను.

"లేదప్పా... రాత్తిరికి టికెట్ తీస్తిని. ఈ తూరి తప్పక వత్తును. ఉంగ అక్కనీ, బావనీ శానా అడిగానని చెప్పుమీ. స్వాతికి ఇంకా ఇంకా గొప్ప పిరుదులు రావాలని కోరుకున్నానని చెప్పుమీ!" అంటూ కిళ్ళీసారం నిండిన నోటితో చెప్పాడు... ఉమ్మి క్రింద పడకుండా తల పైకెత్తి. ఆ విన్యాసంలో నోటి చివర నుంచి ఎర్రని సారం కొంత కారి ఆయన తెల్లని చొక్కా మీద పడింది. అది ఆయన గమనించనే లేదు.

ఇంక బాలుగారిని ఎక్కువగా ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక, నవ్వును ఆపుకోవడం మరీ కష్టమవుతుండడం వల్లనూ ఆయన దగ్గర సెలవు తీసుకుని వచ్చేశాను.

అప్పటినుంచి నాకు ఎవరికి బిరుదులు ఇచ్చినా బాలుగారి భీషణ భాషణమే జ్ఞాపకం వస్తూ ఉంటుంది.

- ఆంధ్రభూమి మాస పత్రిక... ఏప్రిల్ '98



**టాపిక్ ఛేంజ్ బాగుండదు**

ఓ కొత్త నటి- "డైరెక్టర్‌గారూ... మీరంటే నాకు ఎంతో ప్రేమ! చెప్పలేనంత ప్రేమ.., నిజంగా చాలా ప్రేమ..." అంటూ అవే మాటలు పదేపదే వల్లించసాగింది.

డైరెక్టర్ : అయితే నన్ను పెళ్ళాడతావా?

కొత్త నటి : నాకు టాపిక్ ఛేంజ్ చేయడం ఇష్టం ఉండదు.